క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే వైవీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

గుంతకల్లు: 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని వైఎస్‌ఆర్‌టీఎఫ్ జిల్లా నాయకులు లాలూసాహెబ్, చాంద్‌బాషా విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1998 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికై నా నేటికి ఎంటీఎస్ (మినిమమ్ టైమ్ స్కేల్) వర్తింపు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 500 మంది ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు.

మున్సిపల్ కమిషనర్ నూతన చాంబర్ ప్రారంభం



చాంబర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, తదితరులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కమిషనర్ నూతన చాంబర్‌ను సోమవారం చైర్‌పర్సన్ ఎన్.భవాని ప్రారంభించారు. పునరుద్ధరణ పనుల అనంతరం ప్రారంభించిన చాంబర్‌లో వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జునకు చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మెహరున్నీసా, చాముండేశ్వరి, లింగన్న, భాస్కర్, సుధాకర్, ఎంతు గురప్పయాదవ్, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్, నూర్‌నిజామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి

గుత్తి: పట్టణంలోని కోటలో గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా భవిష్యత్తులో ఆహార కొరత వచ్చే అవకాశముందన్నారు. ప్రపంచ ఆహార సూచిక పట్టికలో మన దేశం దిగువస్థానానికి పడిపోయిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆహార భద్రత, రక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షులు కాశీరావు, సలహాదారుడు గురు శంకర్, సభ్యులు జ్ఞానేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తలనీలాలకు బహిరంగ వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ నేతృత్వంలో తలనీలాలు పోగుచేసుకునేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. మాఘమాసం మినహా విడిది నాల్లో భక్తుల నుంచి తలనీలాలను పోగు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం బాగలమర్రికి చెందిన సరోజమ్మ రూ.3.03 లక్షలకు హక్కులను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ సుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ చిక్కేపల్లిపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక




ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని భారత్ సేవక్ సమాజ్‌లో సోమవారం కాపు సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి మండల కాపు సంక్షేమ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారాకుల రమణ, ఉపాధ్యక్షులుగా మంజునాథ్ రాయల్, ఆదినేని రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా గండికోట రఘువీర్, కార్యవర్గ సభ్యులుగా వెంకటనారాయణ, శ్రీకరం వెంకటేష్, చిరంజీవి, మైరెడ్డి విజయ్, నేలకుర్తి రమేష్, నాగరాజు, విశ్వ మోహన్, ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

జగన్మాతా పాహిమాం

గుంతకల్లు/తాడిపత్రి అర్బన్/పుట్లూరు/గుత్తి/గుంతకల్లు రూరల్/పెద్దవడుగూరు/యాడికి/గార్లదిన్నె/పెద్దపప్పూరు/గుత్తి రూరల్/పామిడి: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో సోమవారం శరన్నవరాత్రుల సందడి నెలకొంది. గుంతకల్లులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో రెండో రోజు వాసవీ మాత గజలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతపురానికి చెందిన సంధ్యామూర్తి కళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన ఎంతోగానో ఆకట్టుకుంది. గుత్తి పట్టణంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు కంచి కామాక్షి దేవిగా పూజలందుకున్నారు. గుంతకల్లు పట్టణంలోని ఆంథోని కాలనీలో కొల్హాపురి మహాలక్ష్మి రెండో రోజు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దవడుగూరులోని పెద్దమ్మ, సుంకులమ్మ, చౌడేశ్వరిదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రిష్టిపాడులో చౌడేశ్వరీ దేవి అమ్మవారు గాయత్రీదేవిగా పూజలందుకున్నారు. యాడికి మండల కేంద్రంలో పెద్దమ్మ తల్లి బాలా త్రిపుర సుందరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గార్లదిన్నె మండలం కల్లూరులో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వాసవీ మాత మధుర మీనాక్షి అలంకరణలో భక్తులను కరుణించారు. పెద్దపప్పూరులో చౌడేశ్వరి మాతను గాయత్రీ దేవి రూపంలో అలంకరించారు. గుత్తి మండలం సేవాగఢ్‌లో మాతా జగదాంబ గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తాడిపత్రిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు, కటిక వీధిలోని అంకాలమ్మ, ఏటిగడ్డ పెద్దమ్మ, గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. చింతల వెంకటరమణస్వామి ఆలయంలో ఆనందవల్లి అమ్మవారు యోగ లక్ష్మీ అలంకారంలో కొలువుదీరారు. పామిడిలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణేశ్వరీ దేవిగా పూజలందుకున్నారు.



యాడికిలో బాలా త్రిపుర సుందరి అలంకారంలో పెద్దమ్మ తల్లి



పెద్దపప్పూరులో గాయత్రీ దేవి అలంకరణలో చౌడేశ్వరి



పెద్దవడుగూరులో పూజలందుకున్న గాయత్రీ దేవి



గుంతకల్లులో విశేష అలంకరణలో వాసవీ మాత



పుట్లూరు మండలం బాలాపురంలో దుర్గమ్మ విగ్రహం వద్ద కుంకుమార్చన



గుంతకల్లు పట్టణంలో బాలాత్రిపుర సుందరిగా కొల్హాపురి మహాలక్ష్మి



తాడిపత్రి పట్టణంలో మధుర మీనాక్షి అలంకరణలో గాంధీ వీధిలోని చౌడేశ్వరి



గార్లదిన్నె మండలం కల్లూరులో మధుర మీనాక్షి అలంకరణలో వాసవీ మాత



గుత్తిలో కంచి కామాక్షి దేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి



గుత్తి మండలం సేవాగఢ్‌లో గాయత్రీ దేవిగా జగదాంబ మాత

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: మండలంలోని పొళ్ళంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే.నారాయణ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

వెండి నాగపడగ వితరణ

గుంతకల్లు రూరల్: కర్నూలు జిల్లా, మద్దికెర మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన తిలక్ కుమార్, శ్రావణి దంపతులు సోమవారం బుగ్గ సంగమేశ్వర ఆలయానికి రూ.31 వేలు విలువైన వెండి నాగపడగను బహూకరించారు. అదేవిధంగా వారి కుమారుడు శివాంష్ చౌదరి పేరున ఆలయ అన్నదానానికి రూ.5,116 అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేర్లతో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి స్వామి ప్రసాదం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వేములపాడు క్రాస్ వద్ద సోమవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఇసుక తరలిస్తున్న తాడిపత్రి మండలం పులి ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన హరీష్ కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి



అండర్ డ్రైనేజీ మరమ్మతులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పాతకోట, జీకే స్ట్రీట్ కాలనీల్లో సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సొంత నిధులతో చేపట్టిన అండర్ డ్రైనేజీ మరమ్మతులను కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు వేగవంతంగా పూర్తి చేసి సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. అలాగే కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వరదలయ్య, కేశవరెడ్డి, సుధీర్, సాయిరాం, బషీర్, బాబా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు



ఎంపీ తలారి రంగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ముస్లిం శ్మశానవాటికకు సంబంధించి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక మైనార్టీ నాయకులు ఎంపీ తలారి రంగయ్యను కోరారు. సోమవారం వారు అనంతపురంలో ఎంపీ రంగయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. స్పందించిన ఎంపీ రంగయ్య.. వెంటనే ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షల ఎంపీ నిధులను కేటాయించారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామని మైనార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల బీసీ విభాగం నాయకుడు వెంకటస్వామిగౌడ్, ఉసేన్‌పీరా , దౌలాసాహెబ్, షేక్షావలి, పీరా, చంటి, బాషా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



తాడిపత్రి: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవి

తాడిపత్రి/యాడికి/పెద్దవడుగూరు/గుత్తి రూరల్/శింగనమల/పామిడి: అనంతపురం జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ రవి అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లోని కమ్యూనిటీ సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అంగన్‌వాడీ టీచర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు. యాడికి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మహిళా సంఘాల సభ్యులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ మహిళా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. పెద్దవడుగూరు మండలంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రజలు సహకరించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మీ, షంషాద్ బేగం, మహిళా పోలీసులు ప్రత్యూష, శాంతి కోరారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గుత్తి పట్టణంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని గ్రామ సంఘం మహిళ అధ్యక్షులతో సమావేశం నిర్వహించి బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వెలుగు ఏపీఎం మల్లికార్జున వివరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. శింగనమలలోని వైకేపీ కార్యాలయంలో బాల్య వివాహాలపై విజయలక్ష్మి మహిళా మండల సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. పామిడి మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అర్హులందరికీ రేషన్ అందాలి

గుంతకల్లు రూరల్: ఆకలి చావుల నివారణే లక్ష్యంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లక్ష్యం. ఆదిశగా కమిటీ సభ్యులు కృషి చేయాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బీబీ మాధవి, ఎంపీడీఓ వెంకటరమణప్ప, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఆహార ధాన్యం అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులపై ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు అర్హులైన వారికి రేషన్ సరుకులతో పాటు, ఇతరత్రా ఆహార ధాన్యాలు అందుతున్నాయాల లేదా అని నిరంతరం పరిశీలించాలన్నారు. ఈ ప్రక్రియలో వీఆర్వోలు నిర్లక్ష్యంగా గానీ, తప్పు చేసినట్లు గానీ తేలితే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు



తాడిపత్రి మండలం భోగసముద్రంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బెంచికొట్టాలలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని ప్రారంభించారు. 28, 29 వార్డులకు చెందిన సుమారు 175 మందికి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ అరుణ, కమిషనర్ మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రెడ్డిపల్లిలో సోమవారం సర్పంచ్ నరసమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 348 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, వైస్ ఎంపీపీ జయలక్ష్మి, మండల కన్వీనర్ అంజే నరేష్, జేసీఎస్ మండల కన్వీనర్ జయపరెడ్డి, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష అని సర్పంచ్ నాగేశ్వరమ్మ అన్నారు. మండలం పరిధిలోని భోగసముద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు లావణ్య, సుమన్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీలు పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మునివేలు, సెక్రటరీ సలీం, ఆరోగ్యకార్యకర్త కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని బాలాపురం గ్రామ సచివాలయ పరిధిలో 210 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ పాల్గొన్నారు.

నేడు చింతకాయమందలో..

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద సచివాలయం-1, 2లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు.

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలో వెంకటాపురంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గార్లదిన్నె మండలం ఇల్లూరు, పుట్లూరు మండలం ఎల్లుట్ల, శింగనమల మండలం ఆకులేడు-2, యల్లనూరు మండలం చింతకాయమంద-1, 2 సచివాలయాల్లో కూడా ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతాయన్నారు.

శింగనమల అభివృద్ధికి ఎమ్మెల్యే పద్మావతి కృషి

బుక్కరాయసముద్రం: నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక కృషి చేశారని ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వరికూటి కాటమయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో శింగనమల చెరువు లోకలైజేషన్‌కు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కృషి చేశారన్నారు. కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రారంభానికి చర్యలు తీసుకున్నారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాగభూషణ, నీలకంఠ, ఎమ్మార్పీఎస్ నాయకులు హరి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి పంచాయతీ పరిధిలోని ఈశ్వరపల్లి గ్రామంలో సోమవారం తాగునీటి మోటార్లకు మరమ్మతులు చేశారు. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోర్లు కాలిపోవడంతో నీటి కోసం గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మోటా పావన్న గ్రామ శివారులో వంకలోని బోరు, శివారెడ్డి దొడ్డిలో ఉన్న మోటార్లకు మరమ్మతులు చేయించారు. కాలిపోయిన మోటార్లు, ఫీజులు, స్టార్టర్ వైర్లు కొత్తవి తెచ్చి మరమ్మతులు పూర్తి చేయించారు. తాగునీటి సరఫరా పునరుద్ధరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడొద్దు

తాడిపత్రిటౌన్: ర్యాగింగ్‌తో విద్యార్థుల జీవితాలు నాశనం అవుతాయని తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య అన్నారు. టెక్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులుక్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కాలేజ్ సెక్రటరీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. టెక్ కళాశాల ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, డీఓఏ నటరాజేశ్వరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్ పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతి మంజూరు

తాడిపత్రిటౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం టపాసుల విక్రయదారులతో తహసీల్దార్ మునివేలు సమావేశం నిర్వహించారు. పట్టణంలో దాదాపు 16 మంది టపాసుల విక్రయ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు సమయం ముగిసిందంటూ 6 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిసింది. కేవలం 10 మందికి మాత్రమే టపాసుల విక్రయాలకు అనుమతులు ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారి సీఐ మోహన్‌బాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీ, అనంతపురం రోడ్డు కాలనీకు చెందిన మహిళలు తాగునీటి సమస్య పరిష్కరించాలని సోమవారం నిరసన చేపట్టారు. బీసీ కాలనీ నుంచి ఖాళీ బిందెలతో గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీగా వచ్చి ధర్నా చేపట్టారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు గాంధీ సర్కిల్‌కు చేరుకుని మహిళలతో చర్చించారు. త్వరలోనే తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నా విరమించారు.

'అనంత'ను కరువు జిల్లాగా ప్రకటించాలి

తాడిపత్రిటౌన్: అనంతపురాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రకృతీ వైపరీత్యాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం అనంతను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మునివేలుకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటరాముడు యాదవ్, మల్లికార్జున, చిన్నప్పయాదవ్ రంగయ్య, సీపీఐ నాయకుడు చిరంజీవి, జిల్లా రైతు సంఘం నాయకుడు ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు ఐదు వినతులు

యల్లనూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై ఐదు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ సుమతి తెలిపారు. యల్లనూరు శ్మశాన వాటికకు సీసీ రోడ్డు, డీ పట్టాకు 2, పెద్దమల్లేపల్లి శ్మశాన వాటిక ఏర్పాటు, కాలవ పూడ్చాలని పలువురు వినతిపత్రాలు అందజేశారన్నారు. ఏఓ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ సుప్రజ, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బేతాపల్లిలో వ్యక్తిపై దాడి

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామంలో లక్ష్మీనారాయణ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శివ, లక్ష్మీనారాయణలు పక్క పక్క ఇళ్లలో ఉంటారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి చిన్నపాటి విషయంపై ఇద్దరు గొడవకు దిగారు. మాటామాటా పెరిగి శివ అనే వ్యక్తి లక్ష్మీనారాయణపై దాడి చేశాడు. దాడిలో గాయపడిన లక్ష్మీనారాయణను కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్‌ఐ శరత్ చంద్ర సిబ్బందితో కలసి సోమవారం దాడులు నిర్వహించారు. 5 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12,270 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా మట్కా, పేకాట, అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని మండల ప్రజలను కోరారు.

పేకాటరాయుళ్ల బైండోవర్



పేకాటరాయుళ్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

యల్లనూరు: మండలంలో పేకాట నిర్వహిస్తున్న ఆరుగురు పేకాటరాయుళ్లను సోమవారం తహసీల్దార్ సుమతి సమక్షంలో సీఐ సుబ్రహ్మణ్యం బైండోవర్ చేశారు. మండలంలో కిరణ్, బాబు, కృష్ణమోహన్, జనార్దన్, తిరుపాల్‌రెడ్డి తదితరులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పేకాట ఆడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఇకమీదట జూదం ఆడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

లారీ ఢీకొని ఐచర్ డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన డ్రైవర్ వినయ్‌కుమార్

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం లారీ ఢీకొన్న ఘటనలో వినయ్‌కుమార్ అనే ఐచర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన వినయ్‌కుమార్ ఐచర్‌లో బెంగళూరుకు బయలుదేరాడు. అయితే కొత్తపేట గ్రామ శివారులో మూత్ర విసర్జనకు ఐచర్‌ను రోడ్డు పక్కన ఆపి కిందకు దిగేందుకు ప్రయత్నించాడు. వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని లారీ ఐచర్ డోర్‌ను బలంగా ఢీకొంది. ప్రమాదంలో వినయ్‌కుమార్ ఐచర్ లోపల పడి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని 108లో గుత్తి ప్రభుత్వ అనుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా ప్యాపిలికి చెందిన చంద్ర అనే యువకుడు బొలెరోలో టమాట లోడ్‌తో అనంతపురము నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు బయలుదేరాడు. గార్లదిన్నె విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై బొలెరో టైర్ పంచర్ అయింది. రోడ్డుపై వాహనం బోల్తా పడటంతో డ్రైవర్ చంద్రకు రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడ్ని 108లో అనంతపురము ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై ఆరా తీశారు.